క్లుప్తంగా

మే 11న అన్నదానం

హుజూర్‌నగర్ : మట్టపల్లిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా రజక సత్రం కమిటీ ఆధ్వర్యంలో మే 11న మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ కమిటీ అధ్యక్షుడు పిల్లుట్ల కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్రం కమిటీకి సంబంధం లేని డి.నారాయణ సత్రం అభివృద్ధి పేరుతో అక్రమ వసూళ్లు చేస్తున్నారనే విషయం కమిటీ దృష్టికి రావడంతో అతనిపై మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు ఎస్.నాగేశ్వరరావు, ఆర్.కోటయ్య, పి.కోటయ్య, గురువర్మ, రమణయ్య, పిచ్చయ్య, రంగా, నాగలింగం, శ్రీనివాస్, అంజి, వీరయ్య, నాగయ్య, కళమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


గోపతండాలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కీసర సంతోష్‌రెడ్డి

మోతె : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మోతె మండలంలోని గోపతండాలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్వారం సింగిల్ విండో చైర్మన్ ముప్పాని శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య, నాయకులు తుమ్మెటి అశోక్‌రెడ్డి, మామిడి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్‌పై పోలీసులకు ఫిర్యాదు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనలో భారత ప్రధాని నరేంద్ర మోదీపై అసత్య, అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై బీజేపీ నాయకులు చింతపాలెం పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పత్తిపాటి విజయ్ ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ నాయకులు కె.లింగరాజు, కె.రమేష్, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళా కళాకారులకు డప్పుల బహూకరణ

గరిడేపల్లి : మండలంలోని అప్పన్నపేట గ్రామంలో సతీష్ మ్యూజిక్ అకాడమీకి చెందిన మహిళా డప్పు కళాకారులకు పొనుగోడు గ్రామానికి చెందిన మద్దిమడుగు గురవయ్య జ్ఞాపకార్థం డాక్టర్ మద్దిమడుగు సైదులు– శోభ దంపతులు రూ. 15వేలు విలువ గల 20 డప్పులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మద్దిమడుగు సైదులుకు సతీష్ అకాడమీ కళాబృందం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

మునగాల: మునగాల మండలం ఆకుపాముల గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వివరాలు.. ఆకుపాముల గ్రామానికి చెందిన జిల్లేపల్లి గోపి మునగాల మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కొనసాగుతున్నాడు. ఆయన శుక్రవారం తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై కోదాడకు వెళ్తుండగా.. గ్రామ శివారులో ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో గోపి కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గోపి ముఖానికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం అతడిని కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతడి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం


అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు

కోదాడరూరల్ : పరిశ్రమల నిర్వాహకులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమని కోదాడ ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ ముత్తినేని శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని చిమిర్యాలలో గల వేదాద్రి పేపర్ పరిశ్రమలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించి మాట్లాడారు. పరిశ్రమల నిర్వాహకులు ఫైర్ సెఫ్టీ రూల్స్ పాటించాలని సూచించారు. సిబ్బంది మట్టయ్య, సత్యనారాయణ, రవి, సురేందర్, ప్రవీణ్, కార్మికులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోదాడరూరల్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం మల్కాపురం గ్రామానికి చెందిన అంబోజి నాగేంద్రబాబు, కృష్ణయ్య స్థానిక వాగు నుంచి ఇసుకను లోడ్ చేసుకొని కోదాడకు వస్తుండగా రాష్ట్ర సరిహద్దులోని రామాపురం క్రాస్‌రోడ్‌లో పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

అధ్వానంగా రహదారులు


కంకర తేలిన వేణుగోపాలపురం-కరివిరాల రోడ్డు


గుంతలమయంగా వేణుగోపాలపురం నుంచి ఆంజనేయనగర్‌కు వెళ్లే రహదారి

- కంకర తేలి, గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు
- అనేక ఏళ్లుగా మరమ్మతులు చేపట్టని అధికారులు
- బీటీలుగా మార్చాలని ప్రజల వేడుకోలు

నడిగూడెం : మండల పరిధిలో పలు గ్రామాల లింకు రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నా రహదారుల అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. నడిగూడెం మండల కేంద్రం నుంచి మునగాల మండలంలోని నారాయణపురం వరకు మూడు కిలోమీటర్ల మేర గల మెటల్ రోడ్డు కంకర తేలింది. పలుచోట్ల గుంతలమయంగా మారింది. అదేవిధంగా వేణుగోపాలపురం నుంచి కరివిరాల వరకు కంకర రోడ్డు, అదేవిధంగా వేణుగోపాలపురం నుంచి వీరాంజనేయనగర్ వరకు బీటీ రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. వల్లాపురం నుంచి అనంతగిరి మండలం చనుపల్లి వరకు, వల్లాపురం నుంచి శ్రీరంగాపురం వరకు, సిరిపురం నుంచి శ్రీరంగాపురం వరకు, కాగితరామచంద్రాపురం క్రాస్ రోడ్డు నుంచి నారాయణపురం వరకు రోడ్లపై ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. రత్నవరం నుంచి తెల్లబల్లి వరకు డబుల్ రోడ్డు మంజూరైన పనులు ప్రారంభించలేదు. చాకిరాల నుంచి శ్రీరంగాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట తండా నుంచి తెల్లబల్లి క్రాస్ రోడ్డు వరకు, బృందావనపురం నుంచి మునగాల మండలం కలకోవ, బృందావనపురం నుంచి జగన్నాథపురం వరకు, చెన్నకేశ్వాపురం నుంచి మోతె మండలం తుమ్మలపల్లి వరకు, కాగితరామచంద్రాపురం నుంచి వెంకట్రాంపురం వెళ్లే రహదారులు దెబ్బతిన్నాయి. రోడ్లు కంకర తేలి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రజాప్రతినిధులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, బీటీ రోడ్లు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



నడిగూడెం నుంచి మునగాల మండలం నారాయణపురం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో విద్యార్థులు, రైతులు, ప్రజలు సాగర్ కాల్వ కట్ట మీదుగా నడిగూడెంకు వెళ్తున్నారు. నారాయణపురం దారిని బీటీ రహదారిగా నిర్మిస్తే మునగాలకు వెళ్లేందుకు దగ్గర అవుతుంది.

– ఎం.డి.జలీల్, నడిగూడెం

ఇబ్బంది పడుతున్నాం



వల్లాపురం నుంచి శ్రీరంగాపురం, చనుపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదకరంగా మారాయి. కంకర తేలి, లోతైన గుంతలు ఏర్పడ్డాయి. దీంతో పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంకరంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి బీటీ రహదారులు నిర్మించి, సమస్యను పరిష్కరించాలి.

– దుస్సా నారాయణ, వల్లాపురం

కనులపండువగా విగ్రహాల ప్రతిష్ఠాపన


జలబిందెలతో ఆలయానికి తరలివస్తున్న గౌడ కులస్తులు

మునగాల : మండలంలోని నారాయణగూడెంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శుక్రవారం శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబదేవి, వన మైసమ్మ, వన ఎల్లమ్మ, శివలింగం, నంది, కౌండిన్య మహర్షి, కలకోడిపుంజు, వినాయకుడు, పోతరాజు విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని గౌడ జెట్టి ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. అదేవిధంగా ఆలయం వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు, మహిళలు జలబిందెలతో పెద్దఎత్తున ఆలయానికి చేరుకొని విగ్రహాలకు అభిషేకం చేశారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ స్థల దాత గోపిరెడ్డి కోటిరెడ్డి, కొండా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, జైహిందూ గౌడ్, గ్రామపెద్దలు సోమిరెడ్డి వీరారెడ్డి, గౌడపెద్దలు పాల్గొన్నారు.

ఫూలే సినిమా విడుదలకు అనుమతి ఇవ్వాలి


ధర్నా చేస్తున్న ప్రజా చైతన్య వేదిక సభ్యులు

కోదాడ : జ్యోతిరావు ఫూలే జీవిత చరిత్ర ఆధారంగా రాబోతున్న ఫూలే సినిమాపై సెన్సార్ బోర్డు పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ విడుదల నిలిపివేయాన్ని నిరసిస్తూ శుక్రవారం కోదాడలోని బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా చైతన్య వేదిక సభ్యులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి కటింగ్‌లు లేకుండా సినిమాను వెంటనే విడుదల చేయడానికి సెన్సార్ బోర్డు అనుమతి ఇవ్వాలని తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాచైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి చిన్ని, పందిరి నాగిరెడ్డి, ముత్తవరపు రామారావు, పంది తిరపతయ్య, రామనర్సయ్య, బడుగుల సైదులు, జీఎల్ఎన్. రెడ్డి, భిక్షం, హరికిషన్‌రావు, నరసింహారావు, ఉదయగిరి, పట్టాభిరెడ్డి, నరేష్, మురళి, రాధాకృష్ణమూర్తి, గోపాల్, బాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్...


ఆర్థికసాయం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మునగాల : మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు సాల ప్రవీణ్ క్యాన్సర్ వ్యాధి బారిన పడ్డారు. వైద్యం చేయించుకోవడానికి ఆర్థికస్తోమత లేక ఇంట్లో మంచానికే పరిమితమై దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. దీంతో శుక్రవారం సాక్షి దినపత్రికలో 'నిరుపేద యువకుడికి క్యాన్సర్' అనే శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి స్పందన లభించింది. సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో సాల ప్రవీణ్‌కు చికిత్స నిమిత్తం శుక్రవారం రూ.18వేల ఆర్థిక సాయం అందజేసినట్లు పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి గోపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ తాజా మాజీ సర్పంచ్ గోపిరెడ్డి వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు రోషయ్య, ప్రతాపరెడ్డి, స్టాలిన్‌రెడ్డి, వీరస్వామి, సురేష్, చిట్టిబాబు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి శుభాకాంక్షలు


మునగాల : లక్ష్మీనారాయణరెడ్డిని సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

మునగాల : కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డిని మునగాల మండలానికి చెందిన పలువురు మాజీప్రజాప్రతినిధులు శుక్రవారం కోదాడలోని ఆయన నివాసంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చింతకాయల ఉపేందర్, నంద్యాల శ్యాంసుందర్‌రెడ్డి, కేసగాని వెంకటేశ్వర్లు, గోపిరెడ్డి వెంకటరెడ్డి, మిట్టగణుపుల రోశయ్య, సుంకి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డికి సన్మానం

కోదాడ : కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డిని శుక్రవారం కోదాడలోని నయానగర్‌లో గల వారి నివాసంలో కలిసిన కేజీ టూ పీజీ విద్యాసంస్థల రాష్ట్ర నాయకుడు గింజల రమణారెడ్డి, ఎంఎస్ విద్యాసంస్థల సీఈఓ ఎస్ఎస్‌రావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కోదాడలో శాశ్వత కోర్టు భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి వచ్చేలా కృషి చేయాలని కోరారు.

ఏఎంసీ పాలకవర్గంలో మఠంపల్లి మండలానికి అగ్రస్థానం

- వైస్ చైర్ పర్సన్‌తో పాటు నలుగురు డైరెక్టర్ల నియామకం

మఠంపల్లి : హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో మఠంపల్లి మండలానికి అగ్రస్థానం దక్కింది. పాలకవర్గంలో వైస్ చైర్ పర్సన్‌తో పాటు మరో నలుగురు డైరెక్టర్లను ఇక్కడి వారినే నియమించారు. మఠంపల్లి మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డిని వైస్ చైర్ పర్సన్‌గా నియమించారు. రఘునాథపాలెం గ్రామానికి చెందిన ముగ్గురికి డైరెక్టర్ పోస్టులు దక్కాయి. వారిలో మఠంపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్న జవ్వాజి రామచంద్రయ్య, మట్టపల్లి వెంకటనారాయణ, షేక్ నాగుల్‌మీరా ఉన్నారు. మరో డైరెక్టర్‌గా మంచ్యాతండా గ్రామ మాజీ సర్పంచ్ భూక్యా రాయసెల్‌ను నియమించారు. మఠంపల్లి మండలానికి మార్కెట్ కమిటీలో అగ్రస్థానం కల్పించడం పట్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలు నిర్వహించాలని రిట్ పిటిషన్ దాఖలు చేశాం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు స్థానిక న్యాయవాదులు జక్కుల వీరయ్య, భూక్య నాగేశ్వరరావు, పల్లి అలెగ్జాండర్, కుక్కడపు సైదులు తెలిపారు. శుక్రవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ మినహా రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లకు షెడ్యూల్ విడుదల చేసి ఎన్నికలు జరిపారని, కావున హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్‌కు కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారుల నియామకం

హుజూర్‌నగర్ : తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ నియమ నిబంధనల ప్రకారం హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారుల నియామకం జరిగిందని బార్ అసోసియేషన్ అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారులుగా ఎంఎస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్యను నియమించినట్లు తెలిపారు. నూతన కోర్టు ప్రారంభోత్సవం కారణంగా బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ వాయిదా పడిందని, శనివారం (నేటి) నుంచి ఎన్నికల అధికారులు ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

నాయనమ్మకు తలకొరివి పెట్టిన మనవరాలు

హుజూర్‌నగర్ : నాయనమ్మకు మనవరాలు తలకొరివి పెట్టిన సంఘటన శుక్రవారం హుజూర్‌నగర్‌లో జరిగింది. పట్టణానికి చెందిన వాడపల్లి సావిత్రమ్మ శుక్రవారం మృతి చెందారు. కాగా, సావిత్రమ్మ భర్త జానకిరాములు, ఒక్కగానొక్క కుమారుడు విజయ్ గతంలో మరణించాడు. విజయ్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబసభ్యుల సూచనల మేరకు పెద్ద మనవరాలు ఝాన్సీ నాయనమ్మకు తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించారు.

కూలీల వేతనాల పెంపుపై చర్చలు

హుజూర్‌నగర్ : రైస్‌మిల్ దినసరి కూలీల వేతనాల పెంపు కోసం యూనియన్ నాయకులు పార్ బాయిల్డ్ రైస్ మిల్ అసోసియేషన్‌తో శుక్రవారం స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో చర్చలు జరిపారు. ఇరువురి మధ్య సయోధ్య కుదరకపోవడంతో చర్చలు ఆదివారానికి వాయిదా వేశారు.

చలివేంద్రాలు ఏర్పాటు


నేరేడుచర్ల : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్, వాసవి క్లబ్ గవర్నర్

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రధాన కూడలిలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, వాసవి క్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు బాటసారులకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా పీఆర్‌ఓ గరిణె అరుణకుమారి, ఆరోగ్య శిబిరాల జిల్లా ఇన్‌చార్జ్ రాచకొండ శ్రీనివాస్‌రావు, జిల్లా చైర్మన్ కొత్త లక్ష్మణ్, సంప్రదాయాల జిల్లా ఇన్‌చార్జ్ వీరవల్లి శ్రీలత, కమ్యూనిటీ జిల్లా ఇన్‌చార్జ్ కందిబండ వాసంతి, జోన్ చైర్మన్ గెల్లి లక్ష్మీనర్సింహారావు, ప్రోగ్రాం ఆఫీసర్ గెల్లి లక్ష్మీప్రసన్న, ఐతసుమంత్, గరిణె జ్యోతి, కవిత, నటరాజ్, సత్యనారాయణ, సైదయ్య, తదితరులు ఉన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గరిడేపల్లి : ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి తాళ్లూరి సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్మలచెరువులో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీతరుణి కార్ డ్రైవింగ్ స్కూల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బచ్చలకూరి నాగయ్య, ఫౌండర్ ప్రెసిడెంట్ బచ్చలకూరి నాగశేఖర్, వైస్ ప్రెసిడెంట్ బాలెన వెంకటకృష్ణ, గోవర్ధన్, అనంత్ ప్రమీల, లావణ్య, నరసయ్య, గోపి, అర్జున్, వెంకన్న, చంద్రయ్య, కవిరాజ్, శ్రీను, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు


మఠంపల్లి : ముళ్ల కిరీటం ధరించి ఏసుక్రీస్తు సిలువ మోసే ఘట్టం ప్రదర్శన


మఠంపల్లి : ఏసుక్రీస్తును సైనికులు దోషిగా నిలబెట్టిన సన్నివేశం


మఠంపల్లి : గుడ్‌ఫ్రైడే సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని శుభవార్త చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. క్రీస్తు వేషధారణలో నాటికను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. రాజభక్తిని తూలనాడుతూ క్రైస్తవులకు దైవబోధనలు చేస్తున్నాడనే నేరంపై పిలాత్‌రాజు ఎదుట ఏసుక్రీస్తును సైనికులు దోషిగా నిలబెట్టడం, శిలువపై క్రీస్తుకు మరణదండన విధించిన పిలాత్‌రాజు తనకు పాపం అంటగూడదని పావన జలపానంలో చేతులు కడుక్కోవడం నుంచి మొదలై ముళ్ల కిరీటం తలపై ధరించి శిలువమోస్తున్న ఏసుక్రీస్తు దేహం రక్తసిక్తమై నడుస్తుండగా సైనికులు కొరడాలతో కొట్టడం, రక్తమయమైన క్రీస్తు ముఖాన్ని వెరోనికమ్మ తెల్లని వస్త్రంతో తుడవడం, చివరకు చర్చి ఆవరణలో సిలువ వేసే 14 ఘట్టాలను క్రైస్తవ యువకులు వివిధ పాత్రలతో సన్నివేశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆంతోనిరెడ్డి, తామస్‌రెడ్డి, జోసెఫ్ చేసిన వ్యాఖ్యానం ఆకట్టుకుంది. ర్యాలీలో క్రైస్తవులు వేలాదిగా పాల్గొన్నారు. ఫాదర్ మార్టిన్ పసల, పాదర్ అల్లం బాల, చర్చి కమిటీ, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలి

మునగాల : మండల వ్యాప్తంగా గల పెనుయేలు వర్షిప్ కేంద్రాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని పెనుయేలు వర్షిప్ కేంద్రంలో పెనుయేలు సంస్థ వ్యవస్థాపకుడు బిషప్.డాక్టర్ జె.సుదర్శనం మాట్లాడుతూ.. గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను క్రైస్తవులకు వివరించారు. సర్వ మానవాళి రక్షణ కోసం యేసుక్రీస్తు తన ప్రాణం పణంగా పెట్టాడని, లోక పాపముల నుంచి మానవాళిని విడిపించారన్నారు. ప్రతిఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెజె.సామ్యూల్‌సన్, మాధవి, భారతమ్మ, రాజేష్, వీరబాబు, మేరీ, మాణిక్యమ్మ, రాజేష్, సరోజిని, కె.రాజు, కరుణ, సువార్తరాజు, తిరుమల, తబితమ్మ, లూధియా, రాహేలమ్మ, ఉదయ్, సతానియేలు పాల్గొన్నారు.


మునగాల : బరాఖత్‌గూడెంలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు


హుజూర్‌నగర్ : ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వేపలసింగారంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో గల ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె శ్రీధర్‌రెడ్డి క్రీస్తు వేషధారణలో సిలువ మోశారు. సిలువపై ఏసుక్రీస్తు రక్తాన్ని చిందించిన ఘట్టాన్ని ప్రదర్శించారు. భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల వ్యాప్తంగా గల క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో శుక్రవారం గుడ్ ఫ్రై డే జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు బైబిల్ సందేశం బోధించారు. పాస్టర్లు సుధాకర్, కాసాని యేసురత్నం, ముక్తేశ్వరరావు, గాబ్రియేలు, ధనికొండ కరుణాకర్, జయరాజు, పాస్టోరేట్ సెక్రటరీ బూరుగడ్డ థామస్, క్రైస్తవులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల వ్యాప్తంగా గల చర్చిల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని సెయింట్ జోసెఫ్ చర్చి, తిలక్‌నగర్ సీఎస్ఐ పెద్ద చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివ్య బలి పూజ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఎస్ఐ సంఘం తరఫున భోజనాలు ఏర్పాటు చేశారు. విచారణ గురువు ఫాదర్ మరయ్య, పాస్టర్ ఫ్రాంక్లిన్, తదితరులు పాల్గొన్నారు.


చిలుకూరు : సీతారాంపురంలోని కవనెంట్ చర్చిలో..


హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో సిలువ మోస్తున్న క్రైస్తవుడు

అన్నదానం.. అభినందనీయం


అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన పోలీస్ ఉద్యోగి పులి వెంకటేశ్వర్లు తన పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ కోదాడ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ అనాథ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు వేమూరి సత్యనారాయణ, ఉపాధ్యాయుడు మైసయ్య, ఆశ్రమ నిర్వాహకురాలు విజయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

కక్షసాధింపుతోనే కాంగ్రెస్ అగ్రనేతలపై కేసులు


హుజూర్‌నగర్ : ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపుతోనే నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చేర్చిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, ఎండీ అజీజ్ పాషా ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లను ఈడీ చార్జిషీట్‌లో చేర్చటాన్ని ఖండిస్తూ శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల మల్లయ్య, సమ్మెట సుబ్బరాజు, అబ్దుల్ మజీద్, బొడ్డు గోవిందరావు, ముషం సత్యనారాయణ, పాశం రామరాజు, కోల మట్టయ్య, పి.రామ్మూర్తి, బి.సైదులు, బెంజిమెన్, గంజి శివ, నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

నడిగూడెం : నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీ, సోనియాగాంధీపై ఈడి చార్జిషీట్ దాఖలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండు మహేందర్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్, నాయకులు గడ్డం మల్లేష్, కాసాని వెంకన్న, చిల్లంచర్ల సత్యనారాయణ, ఎలకా వెంకటరెడ్డి, ఎలకా రామిరెడ్డి, సోమయ్య, కాశీం, కాసాని భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మునగాల : మండలంలోని ఆకుపాముల గ్రామపంచాయతీ, ఇండస్ట్రియల్, రేపాల వ్యవసాయ పరిధి, నరసింహులగూడెం, మర్సకుంటతండా, ఎస్ఎంపేట ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ వికాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మోతె : మండలంలోని రాఘవాపురం 11 కేవీ ఫీడర్, మోతె 11 కేవీ ఫీడర్, రావిపహాడ్ 11 కేవీ ఫీడర్, తుమ్మగూడెం 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున ఆయా ఫీడర్ల పరిధిలోని శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల ట్రాన్స్‌కో ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేరేడుచర్ల : మండలంలోని ముకుందాపురంలో గల 33, 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కల్లూరు నూతన ఫీడర్ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పందిరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త సమాచారం

అనంతగిరి మండలంలో..

అనంతగిరి : మండలంలోని చనుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని త్రిపురవరం 11 కేవి లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున కొత్తగూడెం, త్రిపురవరం గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అనంతగిరి ఏఈ సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో తలిపారు. అదేవిధంగా గోండ్రియాల సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా గోండ్రియాల, కొత్తగూడెం, మంగళితండా, చిమిర్యాల గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

బరాఖత్‌గూడెంలో పశువైద్య శిబిరం

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వెటర్నరీ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ప్రశాంతి మాట్లాడుతూ పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర శ్రీను, పశుపోషకులు దస్తగిరి, షరీఫ్ పాల్గొన్నారు.

ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ట్వీట్

మునగాల : అంతర్జాతీయ చారిత్రక కట్టడాల దినోత్సవాన్ని పురస్కరించుకొని మునగాల మండలంలోని నర్సింహాపురంలో గల శ్రీకోదండరామస్వామి ఆలయాన్ని చారిత్రక దేవాలయంగా గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించి పూర్వ వైభవం తీసుకురావాలని గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ శుక్రవారం ఎక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి ట్వీట్ చేశారు.